క్లుప్తంగా

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని దేవి ఆలయాల్లో శ్రావణమాస శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి దుర్గా అష్టోత్తర, సహస్రనామ కుంకుమపూజలు చేశారు. ఫిరంగిపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, విజయదుర్గా కాలనీలోని విజయదుర్గా మాతకు అర్చకులు రాజేంద్రశర్మ భక్తుల గోత్రాలతో అమ్మకు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: ప్రతిఒక్కరూ తమ ఇంటి చుట్టు ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రత గురించి వివరించినట్లు తెలిపారు. ఇంటి చుట్టుపక్కల ఉన్న వాడని నీటి తొట్టిలు, పాతటైర్లు, కొబ్బరిబోండాలు వంటి వాటిలో వర్షం నీరు నిలువ ఉండకుండా ఎప్పటి కప్పుడు పంపివేయాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే వాటిలో దోమల లార్వా వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే ప్రమాద ముందని తెలియజేసినట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కుంచనపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం తాడేపల్లి మండల పరిధిలోని కుంచనపల్లి, కొలనుకొండ, గుండిమెడ ప్రాంతాల్లో నులకపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల నేపథ్యంలో యర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, బాబూజీనగర్, శిబిరంలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం ముఖ మండపంపై శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలోని రాజ్యలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మంగళగిరి: ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంవీఐ వి.విజయ సారధి అన్నారు. ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఎంతో అవసరమన్నారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రెహ్మాన్, జాతీయ సేవా పథకం అధికారి రేఖా నరేష్, ఆర్.నరసింహ నాయక్ పాల్గొన్నారు.

చలపతి విద్యార్థుల అన్నదానం

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి కళాశాల విద్యార్థులు శనివారం మాతృశ్రీ అనాధాశ్రమాన్ని సందర్శించి అన్నదానం, విద్యకు అవసరమైన స్టేషనరీని అందజేశారు. కళాశాల డేటా సైన్స్ విభాగం స్టూడెంట్ అసోషియేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డేటా సైన్స్ విభాగాధిపతి వి.సాయి శ్రీనివాస్, అధ్యాపకులు ఖాదర్ ఖాషా, డి.రోజా, డి.లావణ్య, హరిత విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనవైపే ప్రజల చూపు

- వచ్చే 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఉంటారు
- అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని చెప్పే దమ్ము బాబు, లోకేష్‌కు ఉందా?
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, రానున్న 30 ఏళ్లు వైఎస్ జగనే ముఖ్యమంత్రిగా ఉంటారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం లచ్చన్న గుడిపూడి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దారా జరిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రతి ఇంటికీ అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందిస్తూ ఖాతాలలో నగదు జమచేసిన ఏపీలో జరిగిన అభివృద్ధిపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుంటే బాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న తోకపార్టీలు మాత్రం ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికైనా ఏపీలో సంక్షేమ పథకం అందలేదని చెప్పే దమ్ము, ధైర్యం, చంద్రబాబు ఆయన తోకపార్టీలు, లోకేష్, పవన్ కల్యాణ్‌కు ఉందా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హత ఉన్న పేదలకు సంక్షేమం అందనీయకుండా తన పార్టీ నాయకులు, అనునాయులకు సంక్షేమ పథకాలను చేరవేసుకున్న బాబుకు రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిపై మాట్లాడే అర్హత ఎక్కడుందని ప్రశ్నించారు. కులం, మతం పునాదులపై పేదలను అణగదొక్కుతూ తన అనునాయులకు పెద్దపీట వేసి సొంత సామాజిక వర్గానికి దోచిపెట్టడమే లక్ష్యంగా బాబు పాలన సాగినందునే నేడు 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆయనను పక్కన పెట్టారని గుర్తుంచుకొని మసలుకుంటే మంచిదన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, వైస్ ఛైర్మన్ బోయపాటి సాంబశివరావు, ముక్కామల, కంతేరు సర్పంచ్‌లు చిమటా వెంకటేశ్వర్లు, బెజ్జం మహేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ యార్డు ఛైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, పసుపులేటి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గుసుగుసూరి సాంబిరెడ్డి, ఎంపీటీసీలు బోడపాటి సుశీల, పలపర్ల కల్పన, మైనార్టీ నాయకులు షేక్ జానీ, షేక్ బాజీ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో బాధితులకు భరోసా

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే



బాధితుడు హనుమయ్య భార్యకు చెక్కు లందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: సీఎం సహాయనిధితో అనారోగ్య బాధితులు అప్పులపాలు కాకుండా భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్‌లో గల కార్యాలయంలో శుక్రవారం పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో చికిత్స పొందలేని వారికి సీఎం సహాయ నిధి నుంచి సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. కార్పొరేషన్ పరిధి సుందరయ్యనగర్‌కు చెందిన బాధితుడు గోరంట్ల దుర్గారావుకు రూ.2.75 లక్షలు, ఉండవల్లికి చెందిన వేమూరి సుబ్బులుకు రూ.65వేలు, యర్రబాలెంకు చెందిన మేడిశెట్టి హనుమయ్యకు రూ.4లక్షలు, తాడేపల్లికి చెందిన తాపవరపు సుభాష్ చంద్రబోస్‌కు రూ.1.30 లక్షలు వెరసి రూ.8.70 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, రేమిడిశెట్టి గోపి, భీమవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటస్థలాల అభివృద్ధిపై దృష్టి

ఈమని పాఠశాల క్రీడామైదానంలో గ్రావెల్ తోలకం



తాడేపల్లిరూరల్: మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) విద్యార్థులలో మానసిక వికాసాన్ని పెంచాలంటే ఆటలు ముఖ్యమని భావించి అస్తవ్యస్తంగా వున్న ప్రభుత్వ పాఠశాలలోని ఆట స్థలాల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేసేందుకు తన సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం ఈమని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ పాఠశాలల్లో చిన్నపాటి వర్షం పడినా బురదమయం కావడంతో ఆ రెండు ప్రాంతాల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టి ఒక్క రోజు వ్యవధిలో పనులు పూర్తి చేశారు. గత రెండు రోజుల క్రితం ఈమని జిల్లా పరిషత్ పాఠశాలలో వర్షపు నీరు, మురుగునీరు రావడంతో తన సొంత ఖర్చులో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి ఆట స్థలంలో నీరు నిలవకుండా చేశారు. అదే గ్రామంలో ఒకే ఆవరణలో వున్న ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ సెంటర్లు రెండు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయని, వర్షం వస్తే విద్యార్థులు నీళ్లలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, షూ తడిసిపోవడంతో క్లాస్ రూమ్‌లు బురదమయం అవుతున్నాయని ఓ విద్యార్థి తల్లి ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయడంతో స్పందించిన ఆయన 48 గంటల్లో తన సొంత ఖర్చులతో గ్రావెల్ ఫిల్లింగ్ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే పాఠశాల ఆట స్థలంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంపై ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

చిరస్మరణీయుడు గరికపాటి రాజారావు



డాక్టర్ గరికపాటి రాజారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: సుప్రసిద్ధ ప్రజా కళాకారుడు, రంగస్థల సినీ నటుడు, దర్శకుడు, ప్రజానాట్యమండలి నిర్మాతల్లో ఒకరు అయిన డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు కంచర్ల కాశయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి కళాకారులు, అభ్యుదయవాదులు, కళాకారులు, కవులు, సీపీఐ నాయకులు విచ్చేసి గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ గరికపాటి రాజారావు ప్రజానాట్యమండలి సాంఘిక నాటకాలకు పెద్ద పీట వేశారని, నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభావంతమైన కళాకారులు పరిచయమయ్యారని వీరిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావు, నృత్య దర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు కంచర్ల కాశయ్య మాట్లాడారు. గుంటక సాంబిరెడ్డి, తుడిమెల్ల వెంకటయ్య, చిన్న సత్యనారాయణ, గంజి వెంకయ్య, బొర్రా శ్రీనివాసరావు, శీలం శ్యామ్, శీలం అనిల్, హనోక్, దొంత కోటేశ్వరరావు, నందుపల్ల భూపతి, రేఖా కృష్ణార్జున బోధి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.బుజ్జిబాబు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు సభ్య దేశాలలో ప్రపంచ అక్షరాస్యతా వేడుకలు, అక్షరాస్యత ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధికి, సమతుల్యమైన ఆహార జీవన విధానం అవలంబించేందుకు, వ్యక్తిగా, సమిష్టిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుటకు, విలువలతో కూడిన జీవన విధానం అవలంబించేందుకు అక్షరాస్యులు గొప్పగా వెలుగొందుతారని అన్నారు. అనంతరం 40 మంది ఇంటర్ విద్యార్థులకు సుమారు రూ.31 వేలతో యూనిఫాం అందజేశారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు పెన్నులు, టిఫిన్ బాక్సులు అందజేశారు. శ్రీరామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, టి.ఆనందరావు, డి.శ్రీనివాసరావు, ఎం.సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం, భవిష్యత్తు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ

తాడేపల్లిరూరల్: ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఆటల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలను రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తోందని, చదువుతో పాటు పాఠశాలలో ఆటల పోటీలు కూడా నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేస్తున్నారని, దానిలో భాగంగానే మన మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని వారు అన్నారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్, 3 మండల పరిషత్ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు ఈ క్రీడల పోటీలకు హాజరయ్యారని, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ-2 కె.లక్ష్మీ నారాయణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ కొప్పుల ప్రకాశరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.ఆంథోని రాజు, సర్పంచ్ పలుకూరి మేరమ్మ, వైస్ ప్రెసిడెంట్ మోదు దుర్గ, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అదనపు లోడు వాడుతున్న 102 మందికి రూ.6.2 లక్షల జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న నిఘా విభాగం ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి

రాయపూడి(తాడికొండ): తుళ్ళూరు మండలం మందడం విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్, విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారులు ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. 9 గ్రామాల పరిధిలో నిర్వహించిన ఈ తనిఖీలలో మొత్తం 3200 సర్వీసులను తనిఖీలు నిర్వహించగా అనుమతి లేకుండా అదనపు లోడు వాడుకుంటున్న 102 మంది వినియోగదారుల నుంచి రూ.6.2 లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ విభాగం ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. సీఆర్డీయే ఎస్ఈ పి.విజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈఈ మల్లిఖార్జున్, అమరావతి డివిజన్ ఈఈ టీవీ తులసీ రామ్, ఏడీఈలు, ఏఈలు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం జి.బాలసుందరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ సోమవారం అండర్ -17, అండర్-14 (బాల బాలికలు) ఎస్‌జీఎఫ్ మండల స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఎస్‌ఎఫ్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నామని, మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పెదవడ్లపూడిలో వేర్వేరు ఇళ్లల్లో చోరీలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడిలోని వేర్వేరు నివాస గృహాల్లో చోరీలు జరిగాయి. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవడ్లపూడికి చెందిన గడ్డిపాటి రమేష్ బాబు బత్తిపూడి నరసింహారావులకు చెందిన నివాస గృహాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రమేష్ బాబు నివాసంలో 2 గ్రాముల బంగారు వస్తువులతో పాటు రూ. 20వేల నగదును దోచుకున్న దుండగులు నరసింహారావు నివాసంలో పూజా సామగ్రిని చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఐటీ- ఏపీలో ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ సదస్సు

ఐనవోలు(తాడికొండ): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో ఏకాగ్రత, పట్టుదలతో ముందుకెళితే సాధించలేనిది ఏదీ లేదని వీఐటీ-ఏపీ అలూమ్ని అసోసియేషన్ ఛైర్మన్ మాతలఫి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నూతనంగా విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ సదస్సులు నిర్వహించడం ద్వారా విశ్వవిద్యాలయ, సంస్కృతి, సాంప్రదాయాలు, ఇతర వసతులు, వనరులపై అవగాహన కల్పించవచ్చన్నారు. కళాశాలలో విద్యార్థుల మానసిక వికాసం కోసం చదువుతో పాటు విజయానికి అవసరమైన కౌన్సెలింగ్ సెంటర్‌లు, ఎడ్యుకేషనల్, కెరీర్ డెవలప్‌మెంట్ సేవలు, పాఠ్యేతర కార్యకలాపాలు, క్లబ్‌లు, పరిశోధనా అవకాశాలు, ఇంటర్న్‌షిప్ మరియు విదేశీ విద్యపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వీఐటీ-ఏపీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, అకడమిక్స్ డీన్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు పాల్గొన్నారు.

మహిళకు టిఫిన్ బండి అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో నివసిస్తున్న పేద మహిళకు మంగళగిరి తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆర్థిక సహాయంతో టిఫిన్ బండిని శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లి బైపాస్‌రోడ్‌లో నివసించే దమ్మర లక్ష్మీదేవి టిఫిన్ బండి పెట్టుకుని జీవనం కొనసాగిస్తోంది. టిఫిన్ బండికి అద్దెలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో టిఫిన్ బండిని తయారు చేయించి అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేకా అంజిరెడ్డి, కల్యాణ్, బాబూరావు, దర్శి రమేష్, మోదుగుల కృష్ణారెడ్డి, సత్యాల రంగస్వామి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లివారి పాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించి సర్పంచ్ దాసరి సుందరమ్మ చేతులు మీదుగా శుక్రవారం అందజేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చుక్కపల్లివారి పాలెం గ్రామానికి చెందిన మేకతోటి సుబ్బారావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే మృతుని కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులగూర కమలాకర్ రావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ఆహ్వాన సంఘ సభ్యుడిగా జేపీ



ఈఓ భ్రమరాంబ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న జేపీ

తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి యున్న దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రత్యేక ఆహ్వాన సభ్యుడిగా తాడేపల్లికి చెందిన జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (జె.పి.) ని నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా, దేవస్థానం ఈఓ భ్రమరాంబ చేతుల మీదుగా శుక్రవారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొట్టు సత్యనారాయణలు తనపై నమ్మకం ఉంచి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రత్యేక ఆహ్వాన సభ్యుడిగా నియమించారని, వారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దానగుణం అలవర్చుకోవాలి



తాడికొండ: పేదలకు సాయమందించే దానగుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ అరకొర జీతాలతో కాలం వెళ్ళదీస్తూ ప్రజా సేవ చేస్తున్న ఆశా వర్కర్లు, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికుల కష్టాలను గమనించిన సాయిప్రసాద్ మండలంలో భారీ ఎత్తున బియ్యం పంపిణీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని పలువురు దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం కత్తెర సురేష్ కుమార్, దాత బెజ్జం సాయి ప్రసాద్ చేతుల మీదుగా 17 మంది ఆశాకార్యకర్తలు, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులకు 25 కేజీల బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.